



ఎయిర్‌లైన్స్ అధికారులతో వాగ్వాదానికి దిగిన ప్రయాణికులు

జాతీయ స్థాయికి నాగచైతన్య ఎంపిక



చేవెళ్ల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-17 జాతీయ స్థాయి వాలీబాల్ గేమ్స్ ఆడేందుకు తెలంగాణ జట్టు తరఫున చేవెళ్ల మండలం ఆలూరు గ్రామానికి చెందిన బి. నాగచైతన్య ఎంపిక య్యాడు. టోర్నమెంట్ ఈనెల 11 నుంచి 15వ తేదీ వరకు ఉత్తర్‌ప్రదేశ్‌లో జరగనున్నాయి. నాగచైతన్య ఆదిభట్ల నారాయణ స్కూల్‌లో పదవ తరగతి చదువుతున్నాడు. జాతీయ స్థాయికి ఎంపిక కావడంపై నాగచైతన్య తల్లిదండ్రులు విఠలయ్య, పద్మ, పీఈటీ హర్షం వ్యక్తం చేశారు.

సమసమాజ స్థాపనే సీపీఐ ధ్యేయం

» జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య

చేవెళ్ల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : పేదల కోసం బడుగు బలహీన వర్గాలు, కార్మికులు, కర్షక ప్రజల శ్రేయస్సు కోసం, సమసమాజ స్థాపనే ధ్యేయంగా సీపీఐ నిరంతరం పని చేస్తుందని పార్టీ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య తెలిపారు. శనివారం చేవెళ్లలో సీపీఐ జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే నెల 26వ తేదీన ఖమ్మంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామని, పార్టీ శ్రేణులు, శ్రేయోభిలాషులు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఐ వందేళ్ల ముగింపు సభ ఉంటుందన్నారు. ఏఐకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. ప్రభులింగం, వడ్ల సత్యనారాయణచారి, సత్తిరెడ్డి, శ్రీనివాస్, జంగయ్య, సుధీర్, ఎండీ. మగ్బుల్, అంజయ్య, శ్రీశైలం ఉన్నారు.

శంకర్‌పల్లి మండలం పర్వేద గ్రామంలో కమ్మేసిన మంచు



చలి.. గజగజ!

రాత్రి వేళల్లో పడిపోతున్న ఉష్ణోగ్రతలు

నిన్న మొన్నటి వరకు వదలని వర్షాలతో ఇబ్బందులు పడిన ప్రజలు.. ప్రస్తుతం చలికి గజగజ వణికిపోతున్నారు. కొన్ని రోజులుగా రాత్రి వేళల్లో తక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో బయటకు రావాలంటే జనం జంకుతున్నారు. పగలు ఎండ ఉంటున్నప్పటికీ సాయంత్రం తరువాత చలిగాలుల తీవ్రత పెరుగుతోంది. తెల్లవారుజామున మంచు కురుస్తోంది. భిన్న వాతావరణంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చలి తీవ్రత పెరుగుతుండడంతో ప్రజలు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. జ్వరం, జలుబు, దగ్గు బారిపడుతున్న వారి సంఖ్య కూడా పెరుగుతోంది. శనివారం రాష్ట్రంలోనే రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో 15 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదుకావడం గమనార్హం.



ఉమ్మడి జిల్లాలో రాష్ట్రంలోనే అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదు

చందన్వెల్లి, తాళ్లపల్లిలో 14.7 డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రత నమోదు

సాయంత్రం నుంచి చలిగాలుల ఉధృతి

బయటకు వచ్చేందుకు జంకుతున్న జనం

రహదారులను కమ్మేస్తున్న పొగమంచు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి) : ఉమ్మడి జిల్లాలో చలి తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. గడిచిన రెండు, మూడు రోజులుగా వాతావరణంలో అనూహ్య మార్పులు చోటు చేసుకుంటున్నాయి. చలిగాలుల ఉధృతి పెరగడంతో అనేక ప్రాంతాల్లో ఈ ఏడాది కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో 15 డిగ్రీలలోపు ఉష్ణోగ్రతలు పడిపోయాయి. శనివారం రాష్ట్రంలోనే అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదుకావడం గమనార్హం. రంగారెడ్డిజిల్లా షాబాద్ మండలం చందన్వెల్లితో పాటు తాళ్లపల్లిలో 14.7 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. అలాగే మంచాల మండలం ఆరుట్లలో 14.9 డిగ్రీలు, షాబాద్, మొయినాబాద్‌లలో 15డిగ్రీల అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అలాగే వికారాబాద్ జిల్లాలోని మాడ్గుల చిట్టంపల్లి, పెద్దఉమ్మెత్తల్, నవాబుపేట, మన్నెగూడలలో 14.8డిగ్రీలు కనిష్ఠ ఉష్ణోగ్రతలు

మిగతా 7వ పేజీలో...

సాంకేతిక లోపంతో విమానం రద్దు

» శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో దాదాపు 12గంటలు ప్రయాణికుల పడిగాపులు

శంషాబాద్ రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ విమానాశ్రయం నుంచి వియత్నాంకు వెళ్లాల్సిన వియత్నాం ఎయిర్‌లైన్స్ వీఎన్ 984 విమానం రద్దు కావడంతో ప్రయాణికులు దాదాపు 12 గంటల పాటు విమానాశ్రయంలోనే పడిగాపులుకాయాల్సిన పరిస్థితి నెలకొంది. జీఎంఆర్ ఎయిర్‌పోర్టు అధికారుల సమాచారం మేరకు.. శుక్రవారం రాత్రి 11.55 గంటలకు 200 మంది ప్రయాణికులతో బయలుదేరడానికి సిద్ధమైన విమానంలో సాంకేతిక లోపం తలెత్తింది. పైలెట్ ఏటీసీ అధికారులకు సమాచారమివ్వడంతో సాంకేతిక నిపుణులు సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నించారు. విమానం ఆలస్యం అవుతుండటంతో ఆగ్రహానికి గురైన ప్రయాణికులు శనివారం ఉదయం 6 గంటలకు ఎయిర్‌లైన్స్ అధికారులతో వాగ్వాదానికి దిగారు. చివరకు ఉదయం 11 గంటలకు విమానాన్ని రద్దు చేస్తున్నట్లు ఎయిర్‌లైన్స్ అధికారులు ప్రకటించారు. సరైన సమాచారం ఇవ్వకపోవడంతో దాదాపు 12 గంటలు ఎయిర్‌పోర్టులోనే ఉండాల్సిన పరిస్థితి నెలకొనడంతో ఎయిర్‌పోర్టు, ఎయిర్‌లైన్స్ అధికారులకు వ్యతిరేకంగా ప్రయాణికులు నినాదాలు చేశారు. కనీసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కూడా చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఢిల్లీ, ముంబై, శివమొగ్గ విమాన సర్వీసులు రద్దు

ఢిల్లీ, ముంబైలో ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ వ్యవస్థలో సాంకేతిక సమస్యల వల్ల ఢిల్లీ, ముంబై, శివమొగ్గలకు వెళ్లాల్సిన విమానాలను రద్దు చేశారు. దీంతో శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ప్రయాణికులు ఆందోళనకు దిగారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి కౌలాలంపూర్ వెళ్లాల్సిన విమానం దాదాపు 6 గంటలు ఆలస్యంగా బయలుదేరింది. శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి గోవా వెళ్లాల్సిన విమానం కూడా ఆలస్యంగా బయలుదేరింది. సాంకేతిక సమస్యల వల్ల రెండో రోజూ ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

భగీరథా.. ఏమిటీ వృథా



షాద్‌నగర్ పట్టణంలోని హైదరాబాద్ రోడ్డులో ఎల్ఎన్ ఫంక్షన్ హాలు ఎదుట ఎక్స్‌కవేటర్ తవ్వకాల్లో శనివారం సాయంత్రం మిషన్ భగీరథ తాగునీటి పైపులైన్ పగిలింది. దీంతో తాగునీరు ఉవ్వెత్తున ఎగిసిపడి రోడ్డు పక్కన ప్రవహించింది. విషయం తెలుసుకున్న మున్సిపల్ సిబ్బంది నీటి సరఫరాను నిలిపివేశారు. అప్పటికే చాలా వరకు నీరు వృథాగా పోయింది.

- షాద్‌నగర్ అర్బన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి)

ఆలయ ముఖ ద్వారం



ఆద్యంతం.. ఆహ్లాదం

జానంపేట వేంకటేశ్వరస్వామి ఆలయ పరిసరాలు

» 400 ఏళ్ల క్రితం నిర్మాణం.. కోర్కెలు నెరవేరుస్తున్న వెంకన్న
» గుడి సమీపంలో ఎటు చూసినా పచ్చదనం
» ఆకట్టుకునేలా కల్యాణ మండప నిర్మాణం
» నిత్యం స్వామివారి దర్శనానికి వందలాది మంది భక్తుల రాక

7

Sunday Special

విశాలమైన ప్రదేశం.. ప్రశాంతమైన వాతావరణం.. ఆధ్యాత్మికతతో ఆహ్వానించే గాలి గోపురం.. లోపలికి వెళ్లగానే ప్రకృతి అందాల పరవశం.. పచ్చని చెట్ల స్వాగతం.. ఇంతటి ఆహ్లాదాన్ని పంచుతుంది ఫరూఖ్‌నగర్ మండల కేంద్రంలోని శ్రీలక్ష్మి వేంకటేశ్వర స్వామి ఆలయం. 400 ఏళ్ల చరిత్ర గల ఈ గుడి ప్రాంగణంలోకి ప్రవేశించగానే సాక్షాత్తు ఆ వేంకటేశ్వరుడి దివ్య సుందర రూపం దర్శనం పొంది భక్తులు పరవశించి పోతారు. షాద్‌నగర్ పట్టణంలోని పాత జాతీయ రహదారి పక్కనే ఉన్న ఈ ఆలయాన్ని నిత్యం వందలాది మంది భక్తులు వచ్చి స్వామివారికి దర్శించుకుంటారు.



ఆలయ గోపురం

కేంద్ర పథకాలను వినియోగించుకోవాలి

» చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

మొయినాబాద్ రూరల్, నవంబరు8(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వినియోగించుకొని మత్స్యకార సంఘాలు మరింత ఆర్థికాభివృద్ధి సాధించాలని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తెలిపారు. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని చిలుకూరు చెరువు వద్ద మత్స్యకార సంఘానికి జస్టిస్ కొండా మాధవరెడ్డి ఫౌండేషన్ ద్వారా చేపలు పట్టడానికి అవసరమయ్యే పడవలను శనివారం ఎంపీ అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత 20, 30 ఏళ్ల క్రితం మత్స్యకార సంఘాలు లాభాల బాటలో పయనించాయని, ప్రస్తుతం తెలంగాణలో చేప పిల్లల ఉత్పత్తి లేని కారణంగా ఇతర రాష్ట్రాల నుంచి తెచ్చి ఇక్కడ పెంచడం ద్వారా ఆర్థికంగా భారమవుతుందన్నారు. అందువల్ల మత్స్యకార సంఘాలు లాభాలు ఎక్కువగా ఆర్జించడం లేదని పేర్కొన్నారు. మన రాష్ట్రంలో చేప పిల్లల ఉత్పత్తికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని సూచించారు. అదే విధంగా మత్స్యకార సంఘాలకు అవసరమ్యే విధంగా ప్రస్తుత చట్టాలను మార్చి ఆదుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే రత్నం, సీనియర్ నాయకులు గున్నాల గోపాల్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, మత్స్యకార సంఘం నాయకులు శ్రీరాములు ముదిరాజ్, సంఘం నాయకులు ఉన్నారు. తమ సంఘానికి ఉచితంగా పడవలను అందించిన విశ్వేశ్వర్‌రెడ్డికి మత్స్యకార సంఘం సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



పడవలో ప్రయాణిస్తున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేయాలి

సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల డీసీవో సాయిలత

వికారాబాద్‌లో ముగిసిన 11వ జోనల్ స్పోర్ట్స్ మీట్

7



విద్యుత్ తీగల కింద ప్రమాదకరంగా డంపింగ్ యార్డు

డేంజర్‌గా డంప్ యార్డు

ఇబ్బందులు పడుతున్న ప్రజలు

విద్యుత్ తీగలకు పొంచి ఉన్న ప్రమాదం

సబ్‌స్టేషన్‌కు వెళ్లేందుకు సిబ్బంది అవస్థలు

కొత్తూర్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కొత్తూర్ పారిశ్రామికవాడ శివారులో తిరుపతి ఉద్యోగ్ పరిశ్రమ రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన కొత్తూర్ మున్సిపాలిటీ డంపింగ్ యార్డు ప్రమాదకరంగా మారింది. మున్సిపాలిటీ పరిధి నుంచి వెలువడుతున్న చెత్తను డంపింగ్‌యార్డుకు తరలిస్తున్నారు. యార్డుతో పాటు ఆ పక్కనే ఉన్న రోడ్డుపై చెత్తను పారబోస్తుండడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దుర్గంధం, దుర్వాసన వెదజల్లుతోందని వాపోతున్నారు. డంపింగ్ యార్డు వద్ద పశువులతో పాటు, కుక్కలు ఎక్కువగా సంచరిస్తున్నాయి. యార్డుకు సమీపంలో 132/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ఉండడంతో యార్డుపైన విద్యుత్

మిగతా 8వ పేజీలో...

చెత్తకు నిప్పు పెట్టొద్దు..



డంపింగ్ యార్డు పైన 132/11 కేవీ సబ్‌స్టేషన్‌కు భారీగా విద్యుత్ వైర్లు ఉన్నాయి. కాగా, ఇక్కడి నుంచే పలు సబ్‌స్టేషన్లకు విద్యుత్ సరఫరా జరుగుతుంటుంది. ఒకవేళ ఎవరైనా డంపింగ్‌యార్డులో ఉన్న చెత్తకు నిప్పు పెడితే మంటలు చెలరేగి వైర్లకు తాకే అవకాశం ఉంది. త్వరలో సమస్యకు పరిష్కారం చూపుతాం.

- రమేష్‌గౌడ్, ఏఈ, విద్యుత్ శాఖ

చండీ యాగంలో భక్తులు



ముగిసిన సహస్ర చండీయాగం

కడ్తాల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మైసిగండి మైసమ్మ ఆలయంలో శనివారం సహస్ర చండీయాగం ముగిసింది. మూడు రోజుల పాటు నిర్వహించిన వేడుకలకు భారీ సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఆలయ ఫౌండర్ ట్రస్టీ శిరోలి పంతు, ఈవో స్నేహలత ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, ఒడిశా, కర్ణాటక, మహారాష్ట్రల నుంచి 145 మంది వేద బ్రాహ్మణులు, అర్చకులు యాగంలో పాల్గొన్నారు. తహసీల్దార్ ఆర్‌పీ.జ్యోతి అరుణ్ దంపతుల ఆధ్వర్యంలో ప్రముఖ వేదపండితులు రాధాకృష్ణ శర్మ పూర్ణాహుతితో యాగం ముగించారు. ముగింపు కార్యక్రమానికి నాగర్ కర్నూల్ మాజీ ఎంపీ పోతుగంటి రాములు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆలయ నిర్వాహకుడు రమావత్ భాస్కర్, వాగ్దేవి, టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, మాజీ సర్పంచ్‌లు శేఖర్‌గౌడ్, తులసీరామ్‌నాయక్, పాండునాయక్, జవహర్‌లాల్ నాయక్, తులసి రామ్‌నాయక్, బీచ్యనాయక్, యాదగిరి, సీత అరుణ్, చంద్రయ్య, కృష్ణ, శ్రీను, రాములు, వెంకటేశ్ పాల్గొన్నారు.

అంబరాన్నంటిన బోనాల సంబురం



బోనాలతో ఆలయానికి ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

కడ్తాల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కడ్తాల్ మండలం కానుగుబాయి తండాలో బోనాల వేడుక అంబరాన్నంటింది. శనివారం బోనాల కార్యక్రమాన్ని తండా గిరిజనులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. తండాలో తుల్జా భవానీ మాత దేవాలయాన్ని నిర్మించి విగ్రహ ప్రతిష్ఠ చేసి 16 రోజులైన సందర్భంగా బోనాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ నేపథ్యంలో వివిధ ప్రాంతాల్లో ఉన్న గిరిజనులు పెద్ద ఎత్తున తండాకు చేరుకున్నారు. దీంతో కానుగుబాయి తండాలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. మహిళలు పట్టు వస్త్రాలు ధరించి బోనపు కుండలను అలంకరించుకొని ర్యాలీగా అమ్మవారి ఆలయానికి చేరుకొని నైవేద్యాలు సమర్పించారు. ర్యాలీలో యువతీ, యువకుల నృత్యాలు, బ్యాండ్ వాయిద్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో తండా నాయకులు బిక్యానాయక్, పాండు, లక్ష్మణ్, రాజు, బీచ్య, దేవుల జాన్య, నాగార్జున, నర్సింగ్, నరేశ్, వినోద్, లక్మన్, రూప్‌సింగ్, బాలు, గోపి, పత్య తదితరులు పాల్గొన్నారు.

లైంగికదాడి.. పోక్సో కేసు నమోదు

మోమిన్‌పేట్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చీమలదరి శివారు అటవీ ప్రాంతంలో బాలికపై ఓ వ్యక్తి లైంగికదాడికి పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. లైంగికదాడికి పాల్పడిన రోషన్ అలీ వహీద్, అతడికి సహకరించిన నర్సిములుపై పోక్సో కేసు నమోదు చేసి శనివారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై అరవింద్ తెలిపారు.


బస్సు షెల్టర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకర్

పేదలకు సేవ చేయడం అభినందనీయం

» షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల ప్రజలకు సేవచేయడం అభినందనీయమని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం కాంగ్రెస్ పార్టీ షాద్‌నగర్ నియోజకవర్గ యువ నాయకుడు కేకే కృష్ణ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన సందర్భంగా షాద్‌నగర్ పట్టణం పరిగి రోడ్డులో బస్సు షెల్టర్‌ను ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే శంకర్ ముఖ్యఅతిథిగా హాజరై బస్సు షెల్టర్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం బస్సు షెల్టర్‌ను ఏర్పాటు చేయడం సంతోషకరమని అన్నారు. కార్యక్రమంలో కొంకల చెన్నయ్య, చెంది తిరుపతిరెడ్డి, రఘునాయక్, అగ్గనూరి బస్వం, మహమ్మద్ ఇబ్రహీం, కరుణాకర్, సయ్యద్ ఖదీర్, అశోక్, ప్రదీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


పల్లె దవాఖాన వద్ద ఆందోళన నిర్వహిస్తున్న స్థానికులు

ఆశా వర్కర్ భర్త తీరుపై స్థానికుల ఆగ్రహం

ఘట్‌కేసర్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): అన్నోజిగూడలోని పల్లె దవాఖాన వద్ద వ్యాక్సినేషన్ కోసం వచ్చిన పిల్లల తల్లిదండ్రులతో దురుసుగా వ్యవహరించిన ఆశా వర్కర్ భర్త తీరుపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం తల్లిదండ్రులు పిల్లలను పల్లె దవాఖానాకు తీసుకువచ్చారు. డాక్టర్ సెలవులో ఉండటంతో ఆశావర్కర్ ఒక్కరే ఉన్నారు. ప్రజలు తొందరపెట్టడంతో అక్కడే ఉన్న ఆశావర్కర్ భర్త తల్లిదండ్రులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నువ్వు మమ్మల్ని బెదిరించడం ఏమిటని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అతడి ప్రవర్తనపై డీఎంహెచ్‌వో, పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులొచ్చి సముదాయించి అందరినీ పంపించేశారు.


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న లక్ష్మీనారాయణ

క్రీడలతో స్నేహభావం పెంపు

» సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ

శంకర్‌పల్లి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ తెలిపారు. చేకూరి సురేంద్ర విఠల్ మెమోరియల్ వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రొద్దుటూరులో శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎస్ విఠల్ ఎంతో గొప్ప వ్యక్తి అని, స్నేహితులందరూ కలిసి ఆయన గుర్తుగా వాలీబాల్ టోర్నమెంట్‌ను నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. గెలుపోటములతో సంబంధం లేకుండా క్రీడాస్ఫూర్తితో ఆడాలని సూచించారు. క్రీడలకు మాత్రమే పరిమితం కాకుండా ఇతర రంగాల్లోనూ రాణించాలని క్రీడాకారులకు సూచించారు. స్పాన్సర్స్ సుభిషి చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, సామాజిక కార్యక్రమాలను చేపట్టుతున్న వాణిలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు సలీంపాష, ఉపాధ్యాయుడు ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.


వర్క్‌షాప్ ముగింపు కార్యక్రమంలో విద్యార్థినులు

వర్క్‌షాప్‌లను సద్వినియోగం చేసుకోవాలి

ఘట్‌కేసర్ రూరల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): అంకుశాపూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ఆర్మీ(భువనగిరి) కళాశాలలో కృత్రిమ మేధస్సు, ఉపాధి నైపుణ్యాలపై నిర్వహించిన వర్క్‌షాప్ శనివారం ముగిసింది. ఇన్ఫోసిస్ ఫౌండేషన్, మ్యాజిక్‌బస్ ఫౌండేషన్‌ల ఆధ్వర్యంలో జరిగిన వర్క్ షాప్‌లో 80 విద్యార్థినులు పాల్గొన్నారు. ప్రిన్సిపల్ శ్రీలత మాట్లాడుతూ.. విద్యార్థినులు ఇలాంటి వర్క్‌షాపుల్లో పాల్గొని నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఐదు రోజులు జరిగిన ఈ వర్క్‌షాప్‌లో విద్యార్థినులు కెరీర్, కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రాంలను నిర్వహించారు. అనంతరం విద్యార్థినులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రమాదేవి, కెరీర్ గైడెన్స్‌సెల్ కో-ఆర్డినేటర్లు మమతారాణి, స్పందన, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

పరిగి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): పరిగి పట్టణ పరిధి ఐదో వార్డు తిరుమల వెంచర్‌లో ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదభరితంగా మారింది. ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె కూలిపోతున్నది. దిమ్మె పక్కనే బాయి గుంత ఉండడంతో ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయాన్ని విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా నిర్లక్ష్యం చేస్తున్నారని వాపోతున్నారు. దిమ్మెకూలిపోవడం, పక్కనే నీటి గుంత ఉండడంతో ఎప్పుడే ప్రమాదం జరుగుతుందోనని జంకుతున్నారు. మనుషులు, పశువులకు ముప్పు పొంచి ఉందని అంటున్నారు. ట్రాన్స్‌కో అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌కు కొత్త దిమ్మె నిర్మించాలని వాలనీవాసులు కోరుతున్నారు.


కూలుతున్న ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె

చలి.. గజగజ!



(ఐదో పేజీ తరువాయి)

నమోదయ్యాయి. అలాగే మేడ్చల్ ఇండస్ట్రియల్ ఏరియాలో 15.6 డిగ్రీల, మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్‌లో 15.7డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదయ్యాయి. అలాగే రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో పగటి ఉష్ణోగ్రతలు కూడా క్రమేపీ తగ్గుతున్నాయి. మూడు జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు దాదాపు అన్ని మండలాల్లో 28 నుంచి 30 డిగ్రీలలోపుగానే నమోదవుతున్నాయి. రాబోయే రోజుల్లో చలి తీవ్రత ఇంకా మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. పగలు ఎండ ఉంటున్నప్పటికీ సాయంత్రం తరువాత చలిగాలులు తీవ్రత పెరుగుతోంది. దీంతో రాత్రివేళ బయటకు వచ్చేందుకు జనం జంకుతున్నారు. రాత్రి పూట రోడ్లన్నీ నిర్మానుష్యంగా ఉంటున్నాయి. తెల్లవారుజామున మంచు కురుస్తోంది. దీంతో ఉదయం 8గంటలకు కూడా కొన్ని ప్రాంతాల్లో పొగ మంచు కనిపిస్తుంది. రోడ్లపై పొగమంచు కారణంగా వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. సీజన్ ఆరంభంలోనే చలి వణికిస్తుండడంతో రాబోయే రోజులు ఎలా ఉంటాయోనని జనం ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా నగర శివార్లలో ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోతున్నాయి. చలి తీవ్రత పెరుగుతుండడంతో ప్రజలు ఆరోగ్య జాగ్రత్తలు తీసుకుంటున్నారు. చలిని తట్టుకునే దుస్తులను ధరిస్తున్నారు. దీంతో మార్కెట్లలో స్వెటర్‌లు, జర్కిన్లు, మంకీ క్యాప్‌లు, దుప్పట్ల కొనుగోళ్లు మొదలయ్యాయి. చలి తీవ్రత పెరగడంతో జ్వరం, జలుబు, దగ్గున బారిపడుతున్న వారి సంఖ్య కూడా పెరుగుతోంది.

సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం

కొడంగల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ శివారులోని సిద్ధనొంపు ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. 111వ వారం పూర్తయిన సందర్భంగా శనివారం సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. కార్యక్రమంలో హిందు వాహిని సభ్యులు, యువకులు పాల్గొన్నారు.


సిద్ధనొంపు ఆలయంలో భక్తుల పూజలు

ఆద్యంతం.. ఆహ్లాదం


స్వామి వారి కల్యాణమండపం

షాద్‌నగర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): అప్పటి వనపర్తి సంస్థానం రాజు నవయ్ వెంకట్‌రాంరెడ్డి భక్తుల కోసం 1692 సంవత్సరంలో శ్రీలక్ష్మి వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని నిర్మించారు. స్వామివారి ధూపదీప నైవేద్యం కోసం ఆలయానికి సుమారు 42 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించారు. సుమారు ఐదెకరాల్లో సువిశాల ప్రదేశంలో ఆలయాన్ని సుందరంగా నిర్మించారు. అప్పట్లోనే స్వామివారిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి వందలాది మంది భక్తులు వచ్చేవారు. కానీ కాలక్రమేణ ఆలయానికి కేటాయించిన భూములు అన్యాక్రాంతం కావడం, ఆలనాపాలన కరువవ్వడంతో ఆలయ గర్భగుడి మినహా, మిగితా కట్టడాలన్నీ శిథిలావస్థతకు చేరుకున్నాయి. దీంతో ఆలయం మొత్తం దుర్గంధభరితంగా మారడం, ధూపదీప నైవేద్యాలకు కూడా కష్టంగా మారడంతో కొందరు స్థానికులు ఆలయ దుస్థితిపై ఎండోమెంట్ అధికారులకు వివరించారు. ఆ తర్వాత ఈ ఆలయాన్ని ఎండోమెంట్ పరిధిలోకి తీసుకువచ్చి ధూపదీప నైవేద్యాలకు సరిపడేలా చర్యలు తీసుకున్నారే తప్ప అభివృద్ధి కోసం పైసా కూడా కేటాయించలేదు.

1997లో పూర్వ వైభవం

అప్పట్లో షాద్‌నగర్ ఎమ్మెల్యేగా టీడీపీ అభ్యర్థి బక్కని నర్సింహులు షాద్‌నగర్ అసెంబ్లీ నుంచి గెలుపొందారు. అనంతరం ఆయన 1997లో తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యులుగా నియమితులయ్యారు. అనంతరం ఆయన షాద్‌నగర్ పట్టణ అభివృద్ధితో పాటు ఆలయ అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారు. శిథిలావస్థకు చేరుకున్న ఆలయానికి పూర్వవైభవం తెచ్చేందుకు గాను 1998లో టీటీడీ ఆగమశాస్త్ర సలహాదారుడు శ్రీనివాస భట్టాచార్యను ఆలయానికి ఆహ్వానించారు. ఆలయాన్ని పూర్తిగా పరిశీలించిన ఆయన స్వామివారి విగ్రహం, స్వామివారి మూల విరాట్‌లు గరుడ, ఆంజనేయ స్వామి విగ్రహాలను మార్చాలని సూచించారు. అనంతరం తిరుమల నుంచి స్వామి వారి కొత్త విగ్రహం, చైన్నై నుంచి గరుడ, ఆంజనేయ స్వామిల విగ్రహాలను తెప్పించి ఆలయానికి కొత్త శోభను తేవడంతో పాటు, సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. అప్పటి నుంచి భక్తుల తాకిడి మొదలైంది.


విరాళాలు అందజేస్తున్న భక్తులు (ఫైల్)

రూ.8 కోట్లతో ఆలయ అభివృద్ధి

ఆలయాన్ని మరింత ఆహ్లాదభరితంగా మార్చేందుకు కంకణం కట్టుకున్న అప్పటి ఎమ్మెల్యే బక్కని నర్సింహులు ఆలయ అభివృద్ధి కోసం భక్తుల నుంచి సుమారు రూ. 8 కోట్ల విరాళాలు సేకరించి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడంతో పాటు ఆలయానికి కేటాయించిన 42 ఎకరాల్లో కొంత స్థలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, తహసీల్దార్ కార్యాలయాలు నిర్మించగా, మిగతా స్థలం అన్యాక్రాంతమైంది. మిగిలిన 5ఎకరాల స్థలం చుట్టూ భారీ ప్రహరీ నిర్మించారు. ఆలయంలో స్వామి కల్యాణం నిర్వహించేందుకు సుందరమైన కల్యాణ మంటపం, చక్కటి ఆకారంలో పుష్కరిణి, అరటి, పూల మొక్కలను పెంచి శోభాయమానంగా తీర్చిదిద్దారు. ప్రస్తుతం సాధారణ రోజుల్లో వందలాది మంది, శని, ఆదివారాల్లో వేలాది మంది స్వామివారిని దర్శించుకోవడానికి రావడం విశేషం.

ఆలయాలను సంరక్షించుకోవాలి



ఎంతో చరిత్ర గల ఆలయాలను సంరక్షించుకోవాల్సిన బాధ్యత మన అందరిపైన ఉంది. భావితరాలు ఇలాంటి ఆలయాలను చూసి గర్వపడుతారు. భక్తులు తమకు తోచినంత విరాళాలు అందజేయడంతోనే శిథిలావస్థకు చేరుకున్న ఆలయాన్ని అభివృద్ధి చేశాం. ఇంకా ఎంతో అభివృద్ధి పర్చాల్సిన అవసరం ఉంది. త్వరలోనే ఆలయంలో భక్తుల సౌకర్యార్థం మరిన్ని వసతులు కల్పించేందుకు కృషి చేస్తాం.

బక్కని నర్సింహులు, మాజీ ఎమ్మెల్యే, షాద్‌నగర్

సేవా కార్యక్రమాల్లో ముందుండాలి

» టాస్క్ సీవోవో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి


సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డితో యువకులు

ఆమనగల్లు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): సేవ, ప్రజా చైతన్య కార్యక్రమాల్లో యువత ముందుండాలని టాస్క్ సీవోవో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. యువశక్తి దేశానికి గొప్ప నిధి అని ఆయన అన్నారు. హైదరాబాద్‌లోని ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్లిన సుంకిరెడ్డిని శనివారం కల్వకుర్తి నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన పలువురు యువకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఐక్యత ఫౌండేషన్ ద్వారా నియోజకవర్గంలో అందిస్తున్న వైద్య, ప్రజా సేవా కార్యక్రమాలను హర్షిస్తూ పూలమాలలు, శాలువాలతో ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా సుంకిరెడ్డి మాట్లాడుతూ యువత శక్తియుక్తులపైనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉందన్నారు. ఐక్యత ఫౌండేషన్ సేవలు కల్వకుర్తి నియోజకవర్గంలోని ప్రతీ గడపకు చేరవేస్తామని అన్నారు. విద్య, వైద్యం, ఉపాధి కల్పన, కల్వకుర్తి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే ఫౌండేషన్ లక్ష్యమన్నారు. మొబైల్ హెల్త్ క్యాంపుల ద్వారా నియోజకవర్గంలో లక్ష మందికి ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు.

ప్రతీ గడపకు సంక్షేమ పథకాలు


కందుకూరు : ప్రచారంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి జంగారెడ్డి, భాస్కర్‌రెడ్డి, మల్లేశ్

ఆమనగల్లు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రతీ గడపకు సంక్షేమ పథకాలు అందించిన ఘనత కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానిదేనని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. ప్రభుత్వ తోడ్పాటుతో ప్రజలు కష్టాల నుంచి వైదొలిగి ఆనందంగా ఉంటే విపక్షాలు జీర్ణించుకోలేక ప్రభుత్వంపై విష ప్రచారానికి ఒడిగట్టాయని మండిపడ్డారు. ఆమనగల్లు, కల్వకుర్తి, కడ్తాల్, మాడ్గుల, వెల్దండ, తలకొండపల్లి మండలాల నాయకులతో కలిసి శనివారం జూబ్లీహిల్స్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. యూసుఫ్‌గూడలో పలు కాలనీల్లో ఇంటింటికీ తిరిగి కాంగ్రెస్ అభ్యర్థి నవీన్‌యాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. జూబ్లీహిల్స్‌లో ఓటమిని ముందుగానే గ్రహించిన బీఆర్ఎస్, బీజేపీలు అవినీతి సొమ్ముతో ప్రజలను మభ్యపెట్టేందుకు కుట్ర రాజకీయాలు సాగిస్తున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా, మండల నాయకులు బట్టు కిషన్‌రెడ్డి, గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, గూడూరు భాస్కర్ రెడ్డి, మంగ్లీ రాములు, గుర్రం కేశవులు, సూదిని కొండల్‌రెడ్డి, బొజ్జ సాయిరెడ్డి, పాలకుర్ల రాములు, జక్కు అనంత్‌రెడ్డి, జగన్, మానయ్య, ప్రభాకర్‌రెడ్డి, కాసు శ్రీనివాస్ రెడ్డి, మహేందర్, రమేశ్‌యాదవ్, యాదయ్య, కాలె మల్లయ్య, చేగురి వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్‌లో నవీన్ యాదవ్‌దే గెలుపు

కందుకూరు : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో నవీన్‌యాదవ్ గెలుపునకు ఉపయోగపడుతాయని పీసీసీ ప్రధాన కార్యదర్శి ఏనుగు జంగారెడ్డి, సభ్యులు దేప భాస్కర్‌రెడ్డిలు ధీమా వ్యక్తం చేశారు. సోమాజిగూడ డివిజన్ ఎల్లారెడ్డిగూడలో నిర్వహించిన ప్రచారంలో వారు పాల్గొన్నారు. మహేశ్వరం ఏఎంసీ చైర్మన్ ఎస్.కృష్ణానాయక్, ప్యాక్స్ మాజీ చైర్మన్ ఎస్.మల్లేశ్, నాయకులు గోవర్ధన్‌రెడ్డి, ఎస్ జగన్, సమత, శ్రీనునాయక్, డి.నర్సింహాచారి, పాండుగౌడ్, వెంకటేష్, పాండురంగారెడ్డి, బాల్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.


ఆర్థికసాయం అందిస్తున్న నాయకులు

బస్సు ప్రమాద బాధితులకు చేయూత

చేవెళ్ల/యాలాల, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఇటీవల ఆర్టీసీ బస్సు ప్రమాదంలో తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మారిన హాజీపూర్ గ్రామ అక్కచెల్లెళ్లకు ఓ మాజీ సర్పంచ్, యువ నాయకుడు చేయూతనందించారు. చేవెళ్ల మండలం గొల్లపల్లి మాజీ సర్పంచ్ లొంక శ్రీనివాస్‌గౌడ్, యువ నాయకుడు కందికొండ విగ్నేష్‌గౌడ్‌లు తమవంతు సాయం అందించి ఔదార్యాన్ని చాటుకున్నారు. మీర్జాగూడ రోడ్డు ప్రమాదంలో 19 మంది మృతిచెందగా.. అందులో యాలాల మండలంలోని హాజీపూర్ గ్రామానికి చెందిన భార్యభర్తలు బందెప్ప, లక్ష్మీ మృతి చెందారు. దాంతో వారి ఇద్దరు కూతుళ్లు శివలీల, భవానీలు అనాథలుగా మారారు. ఈమేరకు శనివారం గ్రామానికి చేరుకుని అక్కాచెల్లెళ్ల కుటుంబాన్ని పరామర్శించారు. శ్రీనివాస్‌గౌడ్ రూ.లక్ష, విఘ్నేష్‌గౌడ్ రూ.20 వేల ఆర్థిక సాయం అందజేశారు. అలాగే రెండు నెలలకు సరిపడా క్వింటాల్ బియ్యం, నిత్యావసర సరుకులను అందజేశారు. మాజీ సర్పంచ్ జహంగీర్, నాయకులు మహేష్‌గౌడ్, గ్రామస్తులు ఉన్నారు.

విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేయాలి

» సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల డీసీవో సాయిలత

» వికారాబాద్‌లో ముగిసిన 11వ జోనల్ స్పోర్ట్స్ మీట్



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీసీవో సాయిలత


ఓవరాల్ చాంపియన్‌షిప్ కప్పులు అందుకుంటున్న క్రీడాకారులు

వికారాబాద్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఆకాశమే హద్దుగా తమ జీవిత లక్ష్యాల సాధనకు పాటుపడాలని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల డీసీవో సాయిలత పిలుపునిచ్చారు. మూడు రోజులుగా అనంతగిరిపల్లిలోని బాలుర గురుకుల విద్యాలయం-శివారెడ్డిపేటలో జరిగిన జోనల్ స్పోర్ట్స్ మీట్ శనివారం ముగిసింది. ముగింపు కార్యక్రమానికి సాయిలత హాజరై మాట్లాడారు. కళాశాల స్థాయి నుంచే లక్ష్యాల సాధనకు కృషి చేయాలని సూచించారు. ఉన్నత చదువులు చదువుకోవాలన్నా.. క్రీడాకారులుగా ఎదగాలని, లక్ష్యం సాధించే వరకు విశ్రమించకూడదని తెలిపారు. ప్రిన్సిపాల్ రమాదేవి మాట్లాడుతూ.. విద్యార్థులు తల్లిదండ్రులకు, చదువుకున్న పాఠశాలలు, కళాశాలల ఉపాధ్యాయులు, అధ్యాపకులకు మంచిపేరు తెచ్చేలా కృషిచేయాలన్నారు. అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదిగేలా శ్రమించాలని అన్నారు. అంతకు ముందు క్రీడాకారులు పరేడ్ నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రిన్సిపాళ్లు, పీడీలు, పీఈటీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

విజేతలు వీరే..

జోనల్ స్థాయి పోటీల్లో అండర్-14 విభాగంలో చిల్కూర్ విద్యార్థులు ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించారు. అండర్-17 విభాగంలో ఇబ్రహీంపట్నం, అండర్-19 విభాగంలో పరిగి విద్యార్థులు ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించారు. అండర్-14 విభాగంలో 200 మీటర్ల పరుగు పందెంలో ఎం.వినయకుమార్(పెద్దేముల్) ప్రథమ స్థానంలో, సీహెచ్.ఉదయ్‌కుమార్(శంషాబాద్) ద్వితీయ, జీ.ప్రవీణ్ (ఇబ్రహీం పట్నం) తృతీయ స్థానాలు సాధించారు. హైజంప్‌లో ఎం.విశాల్(పెద్దేముల్) ప్రథమ స్థానం కైవసం చేసుకోగా, సీహెచ్.సుశాంత్(శంషాబాద్) ద్వితీయ, ఉమేష్(కొందుర్గు) తృతీయ స్థానాల్లో నిలిచారు. అండర్-17 విభాగంలో బీ.మహేందర్ (శివారెడ్డిపేట) ప్రథమ స్థానంలో నిలవగా, కె.ప్రకాశ్(పెద్దేముల్) ద్వితీయ, మధు(ఇబ్రహీంపట్నం) తృతీయస్థానాలు పొందారు. హైజంప్‌లో రోహిత్(పరిగి) ప్రథమ, టి.చందు(పెద్దేముల్) ద్వితీయ, పి.ప్రశాంత్(శంషాబాద్) తృతీయ స్థానాల్లో నిలిచారు. 400మీటర్ల రిలేలో పరిగి స్కూల్ ప్రథమ, గౌలుదొడ్డి ద్వితీయ, పెద్దేముల్ స్కూల్ తృతీయ స్థానాల్లో నిలిచాయి. అండర్-19 విభాగంలో వి.బన్నీ(ఇబ్రహీం పట్నం) ప్రథమ స్థానంలో నిలువగా, ద్వితీయ స్థానంలో కె.ప్రకాష్(పెద్దేముల్), తృతీయ స్థానంలో చంద్రశేఖర్(శంషాబాద్) నిలిచారు. హైజంప్‌లో ఎ.సత్యనారాయణ(శివారెడ్డిపేట) ప్రథమ, జి.శివప్రసాద్(పెద్దేముల్) ద్వితీయ, భీంరావు(చిల్కూరు)తృతీయ స్థానాల్లో నిలిచారు. 400మీటర్ల రిలే అండర్-19 విభాగంలో ఇబ్రహీంపట్నం ప్రథమ, పెద్దేముల్ ద్వితీయ, చిల్కూరు తృతీయ స్థానాల్లో నిలిచాయి.

కిష్టాపూర్ గురుకుల పాఠశాలలో..

మేడ్చల్ టౌన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ పట్టణంలోని కిష్టాపూర్ బాలికల గురుకుల పాఠశాలలో రెండు రోజులుగా కొనసాగుతున్న జోనల్ స్థాయి ఆటల పోటీలు శనివారం ముగిశాయి. హైదరాబాద్, సంగారెడ్డి, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలుగా నిలిచారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జోనల్ అధికారి నిర్మల, గురుకుల ప్రిన్సిపాల్ లలిత పాల్గొన్నారు.


పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు



షాబాద్ : రాజేందర్‌రెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మహేందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, అవినాష్‌రెడ్డి తదితరులు

రాజేందర్‌రెడ్డి ఆశయాలను కొనసాగిస్తాం



చేవెళ్ల : నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య నాయకులు

చేవెళ్ల/షాబాద్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాజేందర్‌రెడ్డి ఆశయాలను కొనసాగిస్తామని ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ పట్నం అవినాష్‌రెడ్డిలు తెలిపారు. శనివారం దివంగత రాజేందర్‌రెడ్డి జయంతి సందర్భంగా చేవెళ్ల పట్టణ కేంద్రంతో పాటు షాబాద్‌లో ఆయన విగ్రహానికి చేవెళ్ల ఎమ్మెల్యే యాద య్య, పలువురు నాయకులతో కలిసి మహేందర్‌రెడ్డి పూలతో నివాళులర్పించారు. కార్యక్రమాల్లో పీఏసీఎస్ చైర్మన్ శేఖర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ మహేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు నర్సింగ్‌రావు, మాజీ సర్పంచులు ప్రభాకర్‌రెడ్డి, వెంకట్‌యాదవ్, నాయకులు మతీన్, రాజేందర్‌గౌడ్, నర్సింహారెడ్డి, శ్రీరాంరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, చాంద్‌పాషా, ఇమ్రాన్, ముక్రం తదితరులు పాల్గొన్నారు.

షాద్‌నగర్ టు జూబ్లీహిల్స్

● ఉప ఎన్నిక ప్రచారంలో నేతల బిజీ..
● పోటా పోటీగా పార్టీల పరుగులు

షాద్‌నగర్ అర్బన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారంలో షాద్‌నగర్ నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, పార్టీల నాయకులు బిజీ అయ్యారు. వివిధ పార్టీల అధిష్టానం పిలుపు మేరకు ప్రచారం కోసం ప్రతీరోజు ఉదయం పరుగులు పెడుతున్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్‌యాదవ్‌ను గెలిపించాలన్న లక్ష్యంతో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తన అనుచర గణంతో ప్రతీరోజు జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో నిమగ్నమయ్యారు. నిత్యం ఒక మండల కాంగ్రెస్ నాయకులను వెంటపెట్టుకుని ప్రచారం చేస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్, మంత్రులతో కలిసి ప్రచారంలో దూసుకుపోతూ అధిష్టానం నుంచి అభినందనలు పొందుతున్నారు. ఇక బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత గెలుపు కోసం నందిగామ మండలం మొదళ్ళగూడ గ్రామానికి చెందిన ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్‌కుమార్‌రెడ్డి ఉప ఎన్నిక ప్రక్రియ ప్రారంభం నుంచి జూబ్లీహిల్స్‌లోనే మకాం వేసి ప్రచారంలో లీనమయ్యారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు ఇతర నాయకులతో కలిసి ప్రచారంలో బిజీ అయ్యారు. అలాగే మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్య యాదవ్, మాజీ ఎంపీపీ వై.రవీందర్‌యాదవ్ తదితర బీఆర్ఎస్ నాయకులు సైతం అనునిత్యం జూబ్లీహిల్స్‌కు వెళ్లి సునీతను గెలిపించాలని కోరుతూ ప్రచారం చేస్తున్నారు. బీజేపీ అభ్యర్థి లంకాల దీపక్‌రెడ్డిని గెలిపించాలని షాద్‌నగర్‌కు చెందిన రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందె బాబయ్య, నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డి, పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డిలతో పాటు ఇతర నాయకులు ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లతో పాటు ఇతర నాయకులతో కలిసి దీపక్‌రెడ్డిని గెలిపించాలని ఓటర్లను కోరుతున్నారు. ఇక పోతే ఉప ఎన్నిక కారణంగా షాద్‌నగర్ నియోజకవర్గంలోని కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు నేటి(ఆదివారం) సాయంత్రం వరకూ జూబ్లీహిల్స్‌లోనే బిజీబిజీగా గడపనున్నారు.



కాంగ్రెస్ ఎన్నికల ప్రచారంలో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



బీఆర్ఎస్ ప్రచారంలో ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్‌కుమార్‌రెడ్డి



ప్రచారంలో మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్



ప్రచారంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డి

ఘనంగా రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు



తలకొండపల్లి : సీఎం జన్మదిన వేడుకల్లో కాంగ్రెస్ నాయకులు



కడ్తాల్ : కేక్ కట్‌చేస్తున్న ఏఎంసీ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి



ఆమనగల్లు : సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు/మాడ్గుల/కేశంపేట/కందుకూరు/చౌదరిగూడ/కొందుర్గు/శంకర్‌పల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు శనివారం అట్టహసంగా నిర్వహించారు. ఆమనగల్లు, తలకొండపల్లి, కడ్తాల్, మాడ్గుల మండల కేంద్రాల్లో కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యుఐ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. కేక్ కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. పలు సేవా కార్యక్రమాలు నిర్వహించి మొక్కలు నాటారు. ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి వివిధ మండలాల నాయకులతో కలిసి కేక్ కట్ చేశారు. కార్యక్రమాల్లో కాంగ్రెస్ జిల్లా, మండల నాయకులు భట్టు కిషన్‌రెడ్డి, శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, గూడూరు భాస్కర్‌రెడ్డి, ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, గట్ల కేశవరెడ్డి, యాట నర్సింహ, మెకానిక్‌బాబా, కుమార్‌గౌడ్, కాసు శ్రీనివాస్‌రెడ్డి, బొజ్జ సాయిరెడ్డి, గుర్రం కేశవులు, మంగ్లీ రాములు, డోకూరు ప్రభాకర్‌రెడ్డి, సూదిని కొండల్‌రెడ్డి, బోసు రవి, గాజుల శ్రీను, మానయ్య, జగన్, ఫరీద్, శివలింగం, ఖాదర్, శ్రీనునాయక్, కాలె మల్లయ్య, రమేశ్‌గౌడ్, మోహన్‌రెడ్డి, మిట్టపల్లి అంజయ్య, అజీమ్, సత్యం, రాజశేఖర్, శ్రీరాములు, యాదగిరి, ఖలీల్, నాజర్, అలీమ్, సాయి, మహేశ్, రాములు, మహేందర్, శ్రీశైలం, జగ్గారెడ్డి, కొండల్‌రెడ్డి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు. మాజీ జడ్పీటీసీ, డాక్టర్ ద్యాప విజితారెడ్డి శనివారం రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన రేవంత్‌రెడ్డిని కలిసి సత్కరించారు. అలాగే మాడ్గుల మండల కేంద్రంలో రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేశారు. మాజీ ఎంపీపీ జంగయ్య, సర్పంచ్ యాదయ్య, తదితరులు పాల్గొన్నారు. కేశంపేట మండల కేంద్రంలో యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు అనుమగళ్ల రమేష్ ఆధ్వర్యంలో సీఎం చిత్రపటం ఏర్పాటుచేసి కేక్ కట్ చేసి సంబురాలు జరుపకున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పండ్లు పంపిణీ చేశారు. మాజీ జడ్పీటీసీ విశాలశ్రవణ్ రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్లు భాస్కర్‌గౌడ్, కరుణాకర్, మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు గుండె రాణి, నాయకులు శ్రీధర్ రెడ్డి, గిరిధర్ యాదవ్, కరుణాకర్ రెడ్డి, రావులు పెంటయ్య, తైద పర్వతాలు, కొడూరు రాములు, అమేర్, అనసూయమ్మ, తదితరులు పాల్గొన్నారు. కందుకూరు మండల కేంద్రంలో(కొత్తగూడ)లోని కస్తూర్బాగాంధీ బదిరుల ఉన్నత పాఠశాలలో కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేశారు. మాజీ వైస్ ఎంపీపీ శమంతప్రభాకర్ రెడ్డి, నాయకులు అఫ్జల్‌బేగ్, జి.సుధాకర్‌రెడ్డి, ఎస్.విఠల్‌రెడ్డి, నర్సింహ, జి.రాములుగౌడ్, ఎం.రాములు, ఎగ్గిడి జగదీశ్, ప్రిన్సిపాల్ భార్గవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కాగా, జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారం చేస్తూ రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను మాజీ జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, ప్యాక్స్ చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి ఆధ్వర్యంలో జరుపుకున్నారు. ఏఎంసీ డైరక్టర్లు కె.విష్ణువర్ధన్ రెడ్డి, ప్రశాంత్‌కుమార్, నాయకులు తదితరులు పాల్గొన్నారు. జిల్లేడు చౌదరిగూడ మండల పరిధిలోని రావిర్యాలలో కాంగ్రెస్ శ్రేణులు రేవంత్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు చలివేంద్రంపల్లి రాజు ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి ప్రజలకు పంచిపెట్టారు. సత్యనారాయణరెడ్డి, వెంకటనరసింహారెడ్డి, ఆంజనేయులు, భాస్కర్, నీలయ్య, శివకుమార్ పాల్గొన్నారు. కొందుర్గు మండల కేంద్రంలోని బస్ స్టాండ్ ఆవరణలో కాంగ్రెస్ నాయకులు కేక్ కట్‌చేసి జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. పేద ప్రజలకు పండ్లు, బ్రెడ్, కేక్ పంచిపెట్టారు. కృష్ణయ్య, గోపాల్, తదితరులు పాల్గొన్నారు. శంకర్‌పల్లిలో మార్కెట్ కమిటీ కార్యాలయ ఆవరణలో చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య కేక్ కట్ చేశారు. రేవంత్‌రెడ్డి రాష్ట్రాన్ని ప్రజారంజకంగా పాలిస్తున్నారని ఈ సందర్భంగా ఆయన కొనియాడారు. కార్యక్రమలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గోవిందమ్మ గోపాల్‌రెడ్డి, వైస్ చైర్మన్ చంద్రమోహన్, డైరెక్టర్లు రవిందర్‌రెడ్డి, సుధాకర్ రెడ్డి, యాదవ్‌రెడ్డి, ప్రశాంత్, సర్తాజ్, శ్రీహరి, సీనియర్ నాయకులు ప్రవీణ్‌కుమార్, గోపాల్, శ్రీనివాస్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆమనగల్లు : కేక్ కట్ చేస్తున్న కుమార్‌గౌడ్, నాయకులు



శంకర్‌పల్లి : నాయకులతో కలిసి కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే యాదయ్య



అబ్దిజాను సన్మానిస్తున్న కాలనీ వాసులు

చదువుల తల్లికి ఘన సన్మానం

షాద్‌నగర్ అర్బన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ పట్టణంలోని లక్ష్మీనర్సింహాకాలనీకి చెందిన వ్యాపారవేత్త సోమ రాఘవేందర్ స్వప్న దంపతుల కుమార్తె అబ్దిజా చార్టర్డ్ అకౌంటెంట్ ఫలితాల్లో ఉత్తీర్ణ సాధించింది. దాంతో శనివారం రాఘవేందర్ మిత్రబృందం, కాలనీ వాసులు అబ్దిజాను సన్మానించి, అభినందనలు తెలిపారు. చార్టర్డ్ అకౌంటెంట్ పరీక్షలు అంటేనే భయపడే రోజుల్లో అబ్దిజా తన మొదటి ప్రయత్నంలోనే ఉత్తీర్ణత సాధించి, అందరికీ ఆదర్శంగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పల్లె శ్రీనివాస్‌రెడ్డి, డిస్కో శ్రీనివాస్, వెంకటేష్, సి.నర్సింహారెడ్డి, సోమ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

మైసమ్మ తల్లికి ఘన పూజలు



పూజల్లో మాజీ ఎంపీ రాములు తదితరులు

కడ్తాల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఆపదమొక్కుల దైవంగా, శక్తి స్వరూపిణి, పేదల ఇలవేల్పుగా ప్రసిద్దిగాంచిన కడ్తాల్ మండలం మైసిగండి మైసమ్మ బ్రహ్మోత్సవాలు కనుల పండువగా కొనసాగుతున్నాయి. ఈమేరకు నాలుగో రోజు శనివారం పూజలు, ప్రత్యేక అలంకరణలు, అభిషేకాలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో మాజీ ఎంపీ రాములు, తహసీల్దార్ ఆర్పీ జ్యోతి, నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే ఉన్నత జీవితం

ఆమనగల్లు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): చదువుతోనే ఉన్నత జీవితం లభిస్తుందని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి ఎండీ ఫరీద్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తుందని ఆయన అన్నారు. ఆమనగల్లు సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో శనివారం ఎన్ఎస్‌యుఐ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోటుబుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్న ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందని అన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు జాజిమొగల మహేశ్, సలీం, అనిల్ నాయక్, లక్ష్మణ్, వేణు, బాలకృష్ణ, అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు.త

క్రైం కార్నర్

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

● ఇంటికి ప్లాస్టరింగ్ చేస్తుండగా ఘటన



వెంకటేశ్(ఫైల్)

యాచారం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఇంటికి ప్లాస్టరింగ్ చేస్తుండగా విద్యుత్‌షాక్‌కు గురై ఓ వ్యక్తి దుర్మరణం చెందా డు. నల్గొండ జిల్లా మర్రిగూడ మండలంలోని అజిల్లాపూర్‌నకు చెందిన వెంకటేశ్ గౌడ్(40) యాచారం మండల పరిధిలోని మాల్‌లో ఇల్లు నిర్మించుకుంటున్నాడు. ఈక్రమంలో శనివారం రెయిలింగ్‌కు ప్లాస్టరింగ్ చేస్తుండగా ఇంటికి ఆనుకొని ఉన్న విద్యుత్ వైర్లను గమనించకపోవడంతో చేతులకు తాకాయి. దాంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. అతడికి భార్య లక్ష్మీదేవితో పాటు ముగ్గురు కుమార్తెలున్నారు. మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని బంధువులు సాగర్-హైదరాబాద్ ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. ఎస్సై మధు సముదాయించారు. ట్రాన్స్‌కో అధికారులు చేరుకొని చట్టపరంగా న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మధు తెలిపారు. కాగా, మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ప్రభుత్వ పరంగా అందాల్సిన సాయం గురించి అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఆటోను ఢీకొన్న స్కూల్ బస్సు

● తప్పిన పెను ప్రమాదం

మొయినాబాద్ రూరల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఆటోను ప్రైవేటు పాఠశాలకు చెందిన బస్సు ఢీకొట్టింది. కాగా, ఎవరికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని అజీజ్‌నగర్ రెవెన్యూ పరిధిలో గల క్రిక్ సైడ్ ఇంటర్‌నేషనల్ పాఠశాలకు చెందిన బస్సు శనివారం సాయంత్రం విద్యార్థులను ఎక్కించుకొని చేవెళ్ల వైపు వెళ్తుండగా.. మార్గమధ్యలో జేబీఐఈటీ చౌరస్తాలో యూటర్న్ తీసుకుంటున్న క్రమంలో మొయినాబాద్ ప్రాంతానికి అఖిల్ ఆటోను బస్సు ఢీకొట్టింది. దాంతో ఆటో డ్రైవర్ అఖిల్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదానికి కారణమైన బస్సులో విద్యార్థులు ఉన్నారు. వారికి ఎలాంటి గాయాలు కాలేదు. అనంతరం వారిని వేరే బస్సులో అక్కడి నుంచి తరలించారు. అఖిల్‌కు స్వల్ప గాయాలు కాగా.. సమీపంలోని భాస్కర ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

కుక్కల దాడిలో బాలురకు గాయాలు

షాద్‌నగర్ రూరల్, నవంబరు8 (ఆంధ్రజ్యోతి): వీధి కుక్కల దాడిలో ఇద్దరు బాలురకు తీవ్ర గాయాలైన ఘటన ఫరూఖ్‌నగర్ మండలం నాగులపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన జనార్థన్ కుమారుడు రుత్విక్(3) శుక్రవారం సాయంత్రం పాఠశాల నుంచి వస్తుండగా వీధికుక్క ఒక్కసారిగా బాలుడిపై దాడి చేసింది. కన్ను భాగంలో కరవడంతో రక్తగాయమైంది. అలాగే హేమంత్ కుమార్(3) అనే బాలుడిని కూడా కరిచింది. గ్రామంలో కుక్కలు గుంపులుగా తిరుగుతూ భయాందోళనకు గురి చేస్తున్నాయని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు, పాలకులు కుక్కల నుంచి రక్షణ కల్పించాలని వారు కోరుతున్నారు.

ఇంటర్ విద్యార్థిని అదృశ్యం

చేవెళ్ల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కళాశాలకు వెళ్తున్నానని ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన ఇంటర్మీడియట్ విద్యార్థిని అదృశ్యమైన సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని పామెన గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై వనం శిరీష తెలిపిన వివరాల ప్రకారం.. చేవెళ్ల మండలంలోని పామెన గ్రామానికి చెందిన షాపూరం వెంకటయ్య కూతురు అంకుశ(19) చేవెళ్లలోని శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతోంది. ఈనెల 6న కాలేజీకి వెళ్తున్నానని చెప్పి బయటకు వెళ్లింది. రాత్రి వరకూ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెంది.. కళాశాలకు ఫోన్‌చేస్తే కాలేజీకి రాలేదని ప్రిన్సిపాల్ శేఖర్ చెప్పారు. దాంతో ఆమె ఆచూకీ కోసం తెలిసిన చోటల్లా వెతికినా ఆచూకీ లభించలేదు. తన కూతురు కన్పించడం లేదని శనివారం చేవెళ్ల పోలీస్ స్టేషన్ తండ్రి వెంకటయ్య ఫిర్యాదు చేశాడు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సారా పట్టివేత

చౌదరిగూడ, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గోవుల బండా తండాలో రెండు లీటర్ల సారా పట్టుబడినట్లు షాద్‌నగర్ ఎక్సైజ్ ఎస్సై సునీత తెలిపారు. మండల పరిధిలోని గోవులబండా తండాకు చెందిన శ్రీకాంత్ అనే వ్యక్తి కొడంగల్ నుంచి తన బంధువుల వద్ద నాటుసారాను తీసుకువచ్చినట్లు సమాచారం అందుకున్నారు. ఈమేరకు షాద్‌నగర్ ఎక్సైజ్ పోలీసులు తనిఖీ చేయగా.. శ్రీకాంత్ పొలం వద్ద రెండు లీటర్ల నాటుసారా పట్టుబడినట్లు తెలిపారు. ఈమేరకు విచారణ జరిపి శ్రీకాంత్‌పై కేసు నమోదు చేయనున్నట్లు వివరించారు. సిబ్బంది సుధాకర్, బీరయ్య, శ్రీకాంత్‌లు ఉన్నారు.

డేంజర్‌గా డంప్ యార్డు

(ఐదో పేజీ తరువాయి)

తీగలు ఉన్నాయి. ఇకపోతే సబ్‌స్టేషన్‌కు వెళ్లే సిబ్బంది కూడా నానా ఇబ్బందులు పడుతున్నారు. డంపింగ్ యార్డుకు నిప్పు పెడుతుండడంతో మంటలు చెలరేగి తీగలకు తగిలే అవకాశం ఉందని ట్రాన్స్‌కో అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొత్తూర్, తిమ్మాపూర్, నందిగామ విద్యుత్ సబ్‌స్టేషన్లకు 132/11 కేవీ సబ్‌స్టేషన్ నుంచే విద్యుత్ సరఫరా జరుగుతుంటుంది. ఒకవేళ తీగలకు మంటలు వ్యాపిస్తే భారీ నష్టం జరిగే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. యార్డు సమీపంలో వ్యవసాయ పొలాలు ఉండడంతో దుర్వాసన, దుర్గంధంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఇదిలా ఉండగా, పాత జాతీయ రహదారికి సమీపంలో డంపింగ్‌యార్డు ఉండడంతో దుర్వాసనలు రోడ్డు వరకు వస్తుందని, వాహనచోదకులు సైతం ఇబ్బందులకు గురి కావాల్సి వస్తుందని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి డంపింగ్ యార్డుతో తలెత్తుతున్న సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉంది.



ప్రొసీడింగ్ అందిస్తున్న మాజీ సర్పంచ్ శ్రీధర్ రెడ్డి

కేశంపేటకు మరో 13 ఇళ్లు మంజూరు

కేశంపేట, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కేశంపేట గ్రామానికి మరో 13 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని, లబ్ధిదారులకు ప్రొసీడింగ్‌లు అందించామని మాజీ సర్పంచ్ యెన్నం శ్రీధర్‌రెడ్డి తెలిపారు. లబ్ధిదారులు బైరమోని మాధవి, ఆదిరాల యాదమ్మ, రాజేశ్వరి, రొల్లు సుజాత, కట్రావత్ వెన్నెల, డిల్లీ వెంకటమ్మ, గుంటి కృష్ణమ్మ, రేయ్యల మాధవి, తిమ్మగళ్ల కవిత, జర్పుల పవిత్ర, పోలేపోగు యాదమ్మ, బైకని జంగమ్మలకు శనివారం ప్రొసీడింగ్స్ అందించి, ముగ్గు పోశారు.

భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

మాడ్గుల, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని ఆమనగల్లు మండలం ఇటాయిపల్లికి చెందిన మంచుకొండ హైమావతి అన్నారు. తన భర్త వీరేశం పేర ఉన్న 10ఎకరాల 6 గుంటల భూమిని అక్రమంగా కబ్జా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వెల్దండ మండలంలోని కుప్పగండ్ల పరిధి సర్వేనెంబర్ 237, 238లో 10ఎకరాల 6గుంటలు తమ భూమి కబ్జాకు గురైందని, న్యాయం చేయాలని కోరుతూ శనివారం మాడ్గుల మండల కేంద్రంలోని సూదిని జైపాల్‌రెడ్డి విగ్రహానికి వినతిపత్రం అందజేసింది. తన భర్త జైపాల్‌రెడ్డికి నమ్మదగిన వ్యక్తి అని పేర్కొంది. న్యాయం చేయాలని కోరుతూ వెయ్యి మంది మహిళలతో ఈనెల 10న దీక్ష చేయనున్నట్లు ఆమె తెలిపారు.

ఘనంగా విగ్రహాల ప్రతిష్ఠాపన



చేవెళ్ల : లక్ష్మీ వేంకటేశ్వరాలయంలో వ్రతాలు నిర్వహిస్తున్న భక్తులు



కొందుర్గు : హోమం నిర్వహిస్తున్న గ్రామస్తులు.. ఆలయంలో ప్రతిష్ఠించిన నాగుల విగ్రహాలు

కొందుర్గు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈమేరకు కార్తీక మాసం సందర్భంగా ప్రజలు భక్తిశద్ధలతో హోమం, పూజలు చేశారు. శనివారం కొందుర్గు మండల పరిధిలోని ముట్పూర్ గ్రామంలో ఆంజనేయస్వామి దేవాలయ ప్రాంగణంలో నాగుల విగ్రహాలను ప్రతిష్ఠించారు. గ్రామంలోని భక్తులందరూ ఉదయం నుంచి ఉపవాస దీక్షలు పాటించి, అభిషేకాలు నిర్వహించారు. పాడిపంటలు, సుఖసంతోషాలతో జీవించాలని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో హనుమాన్ దేవాలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు, నాయకులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వ్రతాలు

చేవెళ్ల : కార్తీక మాసం కావడంతో శనివారం పట్టణ కేంద్రంలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. కార్తీక మాసం పురస్కరించుకుని చేవెళ్లలోని వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా భక్తులు సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. దేవాలయం గోవింద నామస్మరణతో మార్మోగింది. కార్యక్రమంలో దేవాలయం ధర్మకర్త పూజారి దేవుని వామనాచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయాలి

ఆదిభట్ల, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యల పరిష్కారానికై ఈనెల 10, 11న రాజేంద్రనగర్‌లోని కాటేదాన్‌లో నిర్వహించే సీఐటీయూ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని, కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీఐటీయూ జిల్లా కార్యదర్శి చంద్రమోహన్, సహాయ కార్యదర్శి జగదీష్ అ న్నారు. శనివారం ఇబ్రహీంపట్నం, ఆదిభట్ల మున్సిపల్‌లో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వాళ్లు మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం అమలు చేయకుండా ప్రభుత్వాలు శ్రమదోపిడీకి గురి చేస్తున్నాయన్నారు. పని ప్రదేశాల్లో కార్మికులకు కంపెనీలు మౌలిక వసతుల కల్పించడం లేదన్నారు. మున్సిపల్, పంచాయితీ, అంగన్వాడీ, ఆశా వర్కర్లకు, మధ్యాహ్న భోజనం కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దేవదాస్, ఉస్మాన్, చంద్రకళ, మణెమ్మ, రాధ, బాల్‌రాజ్, అనిల్ కుమార్, నరేష్, భాగ్య తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ కన్వీనర్ల ఎన్నిక

సీఐటీయూ ఇబ్రహీంపట్నం మండల కమిటీని పాషానరహరి కేంద్రంలో ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా పోల్కంపల్లికి చెందిన పి.జగన్, సభ్యులుగా దేవదాస్, ఉస్మాన్, చంద్రకళ, మణెమ్మ, రాధ, సంతోష్, గీత, అండాలు, నరసింహ, రఘు, రాములు, జంగయ్య, అశోక్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదిభట్ల మున్సిపల్ కన్వీనర్‌గా ఎంపీపటేల్ గూడకు చెందిన తులసిగారి నర్సింహ, కమిటీ సభ్యులుగా బాల్‌రాజు, నరేష్, అనిల్‌కుమార్, జగన్, జయ, మంజుల, బేబీ, భాగ్య, సదా, రాము, మల్లికార్జున్, మహేందర్, యాదయ్యను ఎన్నుకున్నారు.

యాచారం : సీఐటీయూ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా సహాయ కార్యదర్శి పి.బ్రహ్మయ్య అన్నారు. యాచారం మండల సీఐటీయూ రెండో మహాసభ శనివారం మండల కేంద్రంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇచ్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకోవాలన్నారు. లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దుచేయాలని డిమాండ్ చేశారు.

షాద్‌నగర్ అర్బన్ : జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎన్. రాజు కోరారు. ఫరూఖ్‌నగర్ మండల పరిషత్ ఆవరణలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాటేదాన్ ప్రాంతంలో రెండు రోజుల పాటు నిర్వహించ తలపెట్టిన జిల్లా మహా సభ పోస్టర్‌ను ఆయన విడుదల చేశారు.